

పెద్ద పండుగొచ్చింది!

- భోగిమంటలు, రంగవల్లులతో భోగిలక్ష్మికి స్వాగతం
- ఉట్టిపడుతున్న సంక్రాంతి శోభ


సత్యవేడు: గొబ్బి తడుతున్న మహిళలు

సత్యవేడు: నియోజకవర్గ వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. ఆదివారం వీధుల కూడళ్లు, ఇళ్లముందు భోగిమంటలు వేశారు. చిన్నారులు భోగి పిడకలను మంటల్లో వేసి కచిత భస్మాన్ని నుదిటిన దిద్దుకున్నారు. చలిని సైతం లెక్క చేయకుండా మహిళలు రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు.పండుగ సరుకులు, పూజాసామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో దుకాణాలు కళకళలాడాయి. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆదివారం భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు.వేకువ జామునే నిద్రలేచి భోగి మంటలు వేశారు. ఇళ్లలో పలు రకాల పిండి వంటలు తయారు చేశారు. ఉద్యోగల నిమిత్తం పట్టణాల్లో ఉన్న వారు గ్రామాలకు చేరుకోవడంతో కోలాహలంగా మారింది.

పిచ్చాటూరులో: భోగి పండుగను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచే ప్రజలు భోగి మంటలను వేయడం ప్రారంభించారు. భోగిమంటల్లో కాంచిన వేడి నీళ్లతో తలస్నానం ఆచరించారు.


బీఎన్‌కండ్రిగ: కూరగాయల షాపు వద్ద జనం

గౌరమ్మ... దీవించమ్మా


వెలంపాళెంలో కొలువుదీరిన గౌరమ్మలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని వెలంపాళెంవీధిలో సంక్రాంతి వచ్చిందంటే భక్తి వాతావరణం ఏర్పడుతుంది. ఎక్కడా లేని విధంగా ఇక్కడ గౌరమ్మ(గొబ్బెమ్మ)లను ప్రతిష్ఠించి పూజలు చేయడం అనవాయితీ. 70 సంవత్సరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అంతకు ముందు వీధిలో చాలామంది పాడి ద్వారా వచ్చే ఆదాయంతో జీవించేవారు. 70 సంవత్సరాల కిందట ఈ వీధిలో మూడు చోట్ల గౌరమ్మ(గొబ్బెమ్మ)లను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ప్రారంభించారు. దీంతో వారు సిరిసంపదలతో జీవిస్తున్నారు. ఈ తల్లి కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల నమ్మకం. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో ఈ వీధిలో పండుగ వాతావరణం ఏర్పడుతుంది. అమ్మవార్లను సుందరంగా అలంకరించి ఆయా ప్రాంతాల్లో కొలువు దీర్చారు. పట్టణం నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ సంక్రాంతి


కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఆదిమూలంను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నారాయణవనం: సీఎం జగనన్న పానలలో ప్రతి కుటుంబం సంక్షేమ సంక్రాంతిని జరుపుకుంటోందని, సంక్షేమం నిర్విరామంగా కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆదరించి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఆదివారం స్వగ్రామం భీమునిచెరువులో కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఎమ్మెల్యే భోగి పండుగను జరుకున్నారు. వేకువ జామున ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వేశారు. అనంతరం బంధువులు, గ్రామస్తులతో కలిసి కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జిగా వైఎస్సార్ సీపీ అధిష్టానం ప్రకటించడంతో గ్రామస్తులు, బంధువులు ఎమ్మెల్యే ఆదిమూలంను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, పార్టీ నాయకులు సోనూ సురేష్, ఆర్ముగం, మహేష్, అయ్యప్ప, సర్పంచ్‌లు నాగూరు, మురుగేశం తదితరులు శాలువలు కప్పి, గజ మాలలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్ స్థానంతో పాటు, ఏడు నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు.

పరిహారం చెల్లింపు

భీమునిచెరువులో మీచాంగ్ తుపాన్ ప్రభావంతో ఇల్లు దెబ్బతిన్న బాధితురాలు రజనికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 వేల పరిహార చెక్కును ఆదివారం ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. సర్పంచ్ మురుగేశం, జేసీఎస్ కన్వీనర్ బాబు, వీఆర్వో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 12.964.టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 12.694 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హెడ్ రెగ్యులేటరీ నుంచి సత్యసాయిగంగకు 225 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.









అయోధ్య అక్షింతల పంపిణీ


బీఎన్‌కండ్రిగ: కాంపాళెంలో అక్షింతల ఊరేగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, కుక్కంబాకం పంచాయతీల్లోఅయోధ్య నుంచి ప్రచార సేవా సంస్థ సభ్యులు తీసుకొచ్చిన శ్రీరాంలాల పూజిత అక్షింతలను ఆదివారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ అక్షింతలను పదిరోజుల పాటు స్థానిక ఆలయాల్లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నగరివీధిలో ఆదివారం ఇంటింటికీ అయోధ్య పవిత్ర అక్షింతలు, శ్రీరాములవారి చిత్రపటాన్ని ప్రచార సేవా సంస్థ సభ్యులు అందజేశారు.

ముగ్గుల పోటీలు



ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, వలంటీర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆలయంలో స్వచ్ఛ అభియాన్

శ్రీకాళహస్తి(రేణిగుంట): దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శ్రీకాళహస్తి పట్టణ బీజేపీ నాయకులు ముత్యాలమ్మ గుడివీధిలోని శ్రీచక్రేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం శుద్ధి చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహారాష్ట్రలోని నాసిక్‌లోని కాలారాం ఆలయాన్ని పరిశుభ్రం చేశారన్నారు. అయ న స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు గరికపాటి రమేష్‌బాబు, మద్దు వాసుయాదవ్, ఢిల్లీ కుమార్, కన్నా వెంకటేశర్లు, కిరణ్, మణి, రాజా, నరసింహులు, కాండారి గిరిబాబు, అమర్‌నా థ్, సుబ్బు, చైతు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు సమష్టిగా పనిచేస్తాం

కేవీబీపురం: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల వర్గాలు ఐకమత్యంతో పని చేస్తామని బీసీ సెల్ మండల అధ్యక్షుడు అగ్రహారం హరిబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆదివారం ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యమైందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో దళిత నేత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డేవిడ్, నాయకులు బాబూయాదవ్, గోపి, శాస్త్రిరాజు, నాగయ్య, కన్నయ్య, దయాకర్‌నాయుడు, బాలిరెడ్డి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.











